క్లుప్తంగా

నేడు కంటి వెలుగుపై అవగాహన

మేడ్చల్: ప్రభుత్వం చేపడుతున్న కంటి వెలుగు కార్యక్రమంపై మండల పరిషత్ కార్యాయలంలో నేడు అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. ఉదయం 11గంటలకు నిర్వహించే కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామాల కార్యదర్శులు హాజరు కావాలని ఆమె కోరారు.

గుండ్లపోచంపల్లిలో..

గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజా ప్రతినిధులు విధిగా పాల్గొని విజయవంతం చేయాలని మున్సిపల్ కమిషనర్ రాములు కోరారు.

పాఠశాలల్లో వసతుల కల్పనకు వినతి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని నాగారం, రాంపల్లి ఉన్నత పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు, టీచర్ల కొరతను పరిష్కరించాలని గురువారం నాగారం మున్సిపల్ ఛైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి, రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాంపల్లిలో మూడుళ్ల క్రితం మూతపడిన గ్రంథాలయ భవనాన్ని పునఃప్రారంభించాలని కోరారు. వినతి ఇచ్చిన వారిలో అంజయ్యగౌడ్, అన్నంరాజుశ్రీనివాస్, ఏనుగు రామకృష్ణారెడ్డి, జమ్మల శ్రీనివాస్, నెళ్లట్ల విజయభాస్కర్ ఉన్నారు.

ఒత్తిడిని అధిగమించి విజయం సాధించాలి

పోచారం: మానసిక ఒత్తిడిని అధిగమించడం ద్వారా ఎంచుకున్న రంగంలో విజయం సాధించవచ్చని మానసిక వ్యక్తిత్వ వికాస నిపుణుడు మహీపతి శ్రీనివాసరావు అన్నారు. గురువారం అన్నోజిగూడలోని జడ్పీ హై స్కూల్‌లో స్ఫూర్తి ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 'ఒత్తిడిని జయించడం ఎలా' అనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. మానసిక శక్తుల అభివృద్ధికి దోహదపడే పలు విషయాలను వివరించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాకుడు కె.యాదగిరి, ప్రధానోపాధ్యాయుడు గౌరీ శంకర్, విద్యార్థులు పాల్గొన్నారు.

తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి



ఘట్‌కేసర్: ఇంటిలోని వ్యర్థాలను తడి పొడి చెత్తగా వేరు చేసి చెత్త వాహనంలో వేయాలని చైర్ పర్సన్ పావనీయాదవ్ అన్నారు. స్వచ్ఛ మున్సిపాలిటీలో భాగంగా 11 వార్డులో స్థానిక కౌన్సిలర్ మల్లేశ్‌తో కలిసి గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. అనంతరం చైర్ పర్సన్ మాట్లాడుతూ.. అంటు వ్యాధులు ప్రబలకుండ ఇల్లు, పరసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జంగయ్యయాదవ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ రాకేశ్, ధర్మేందర్, శ్రీరాములు, వెంకటేశ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ప్రారంభం

మేడ్చల్: పట్టణంలోని కిందిబస్తీలో కౌన్సిలర్ మణికంఠగౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను గురువారం సీఐ రాజశేఖర రెడ్డి ప్రారంభించారు. మణికంఠ గౌడ్ తండ్రి మాజీ సర్పంచ్ చిలుకరాజు జయంతి సంర్భంగా బస్తీలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడంతో వాటిని ప్రారంభించారు.

ఘనంగా సెట్విన్ కేంద్రం వార్షికోత్సవం

మేడిపల్లి: నిరుద్యోగ యువతి యువకులు వృత్తివిద్య నైపుణ్య శిక్షణ శిబిరాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పీర్జాదిగూడ మున్సిపల్ మేయర్ జక్క వెంకట్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ పాలకవర్గ సభ్యులు, కార్పొరేటర్లు, కమిషనర్ డా.పి.రామకృష్ణారావు సహకారంతో సెట్విన్ కేంద్రం ఏర్పాటు చేశామన్నారు. మేడిపల్లిలోని సెట్విన్ కేంద్రం వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. సెట్విన్ ఎండీ వేణుగోపాల్‌రావుతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసిన మేయర్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కోర్సులు పూర్తి చేసుకున్న సుమారు 134మంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

అల్వాల్: ప్రధానమంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రం సౌజన్యంతో గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో కొంతకాలంగా నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా బీజేపీ అర్బన్ అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి అన్నారు. మచ్చబొల్లారం డివిజన్‌లో గోపు రమణారెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని గురువారం నిర్వహించారు. హరీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభించారు. బీజేపీ నాయకులు మల్లికార్జున్‌యాదవ్, వెంకటేష్, ప్రకాష్ చైదరి, వినయ్, సుజాత, ఆనంద్,నవీన్, ఆర్మీ, ఉదయ్ ప్రకాష్, శాస్త్రీ, కరుణశ్రీ, శ్రీనివాస్, మహేష్, అజిత్, పద్మిని తదితరులు పాల్గొన్నారు.



వివేకానంద స్ఫూర్తి ..
యువతకు దిక్సూచి..

స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని గురువారం మేడ్చల్ నియోజకవర్గంలో వివేకానంద జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆయా కూడల్లోని వివేకానంద విగ్రహాలు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థ సభ్యులు పూలమాలలు వేసి వివేకానంద సేవలను కొనియాడారు.

–మేడ్చల్ జోన్ బృందం



పూలమాలలు వేస్తున్న బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్



చీర్యాల చౌరస్తాలో..



గుండ్లపోచంపల్లిలో నేతలు



మేడ్చల్ లో కౌన్సిలర్లు



మునీరాబాద్‌లో నివాళి అర్పిస్తున్న రాజజ్యోతి, గణేశ్



ఎల్లంపేటలో నివాళులు అర్పిస్తున్న నాయకులు



జయంతి వేడుకలో పాల్గొన్న వైస్ చైర్ పర్సన్ పావనీయాదవ్



అవుషాపూర్‌లో నివాళి అర్పించిన ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



సెంటర్‌ను ప్రారంభిస్తున్న మేయర్ కావ్య

ఆరోగ్య తెలంగాణే లక్ష్యం

జవహర్‌నగర్: ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు వైద్యాన్ని అందిస్తుందని మేయర్ మేకల కావ్య అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని అంబేడ్కర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆమె వైద్యాధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కావ్య మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో పేద ప్రజల వైద్యం కోసం ప్రతి పల్లె, బస్తీకి దవాఖానాలు ఏర్పాటు చేస్తుందన్నారు. గతంలో ప్రభుత్వ దవాఖానాలకు వెళ్లాలంటే భయపడేవారని ప్రస్తుతం అన్ని రకాల వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు అందచేస్తుందన్నారు. జవహర్‌నగర్‌లోని పేద ప్రజల కోసం మంత్రి మల్లారెడ్డి సహకారంతో బస్తీ దవాఖానాలు, ప్రైమరీ హెల్త్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా డిప్యూటీ డీఎంహెచ్‌వో నారాయణ, వైద్యాధికారి పద్మావతి, కార్పొరేటర్లు లావణ్యసతీష్‌గౌడ్, రోజా, ఆరోగ్య శాఖ అధికారులు శైలేష్, షౌకత్‌అలీ పాల్గొన్నారు.

హరితహారానికి మొక్కలు సిద్ధం చేసుకోవాలి



నర్సరీలను పరిశీలిస్తున్న అభిషేక్ అగస్త్య

కీసర: నర్సరీలలోని మొక్కలను సంరక్షించి వచ్చే హరితహారం కార్యక్రమానికి కావాల్సిన మొక్కలను సిద్ధం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అభిషేక్ అగస్త్య అన్నారు. నాగారం మున్సిపాలిటీ పరిధిలోని రాంపల్లిలో మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నర్సరీలు, యాదాద్రి పార్కును గురువారం ఆయన సందర్శించి మాట్లాడారు. హరితహారంలో భాగంగా నాటిన మొక్కలు ఎండిపోకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ రఘు, మేనేజర్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న వాణీరెడ్డి, మల్లేష్‌యాదవ్

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో ప్రణాకాబద్ధంగా అభివృద్ధి పనులు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డి, వైస్ ఛైర్మెన్ బండారి మల్లేష్‌యాదవ్ అన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని 7వ వార్డులోని శిల్పానగర్‌కాలనీలో సుమారు రూ.15 లక్షలు, బాపూజీనగర్ కాలనీలో రూ.7.30 లక్షల నిధులతో సీసీ రోడ్డు పనులను గురువారం వారు ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, గూడూరు సబితా ఆంజనేయలుగౌడ్, అనితాసుధాకర్‌రెడ్డి, రేణుకజగన్మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్కు స్థలాన్ని కాపాడాలని వినతి

అల్వాల్: వెంకటాపురం డివిజన్ పరిధిలోని బ్యాంక్ కాలనీ ఉన్న పార్కు స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ గురువారం కాలనీ వాసులు స్థానిక కార్పొరేటర్ సబితకిషోర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీలోని పార్కు స్థలాన్ని కొంతమంది కబ్జాదారులు ఆక్రమించడానికి ప్రయత్నిస్తున్నారని, సర్కిల్ ఏసీపీ విజయశ్రీ దృష్టికి తీసుకెళ్లి స్థలాన్ని కాపాడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాలనీవాసులు అనిల్‌రెడ్డి, చక్రరావు, ముత్యంగౌడ్, జనార్దన్, చిన్నపరెడ్డి, థామ్సన్, రాదాబాయి, వెంకటలక్ష్మీ, శిరీష, సంధ్య, అఖిల, లక్ష్మి, శివాని తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలి

బోడుప్పల్: విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సీసీఎంబీ డైరెక్టర్ మంజులరెడ్డి అన్నారు. బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని మెరిడియన్ పాఠశాల వార్షికోత్సవానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మారుతున్న కాలమాన పరిస్థితుల్లో ర్యాంక్‌లు, మార్కులే కాకుండా విలువలతో కూడిన విద్య సమాజానికి అవసరమన్నారు. మెరిడియన్ పాఠశాల వ్యవస్థాపకురాలు, మాజీ పార్లమెంట్ సభ్యురాలు బుట్ట రేణుకా మాట్లాడుతూ 25 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన మెరీడియన్ పాఠశాల నేడు అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యను అందించడం గర్వంగా ఉందన్నారు. ఉషారెడ్డి, రాఘవేంద్రరెడ్డి, దీపకరణ్‌రెడ్డి, రాంగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు

విద్యా సంస్థల్లో సంక్రాంతి సంబరాలు



మేడ్చల్ న్యూలిటిల్ లిల్లీ పాఠశాలలో..

మేడ్చల్: పట్టణంలోని వివిధ ప్రైవేటు పాఠశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో పాఠశాల ఆవరణలో సంక్రాంతి ముగ్గులు వేశారు. చిన్న గుడిసెలు వేసి వాటి ముందు అందమైన ముగ్గులు వేసి సంబరాలను జరుపుకున్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో..

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. విద్యార్థులు, అధ్యాపకులు సంప్రదాయ దుస్తులు ధరించి కళాశాల వచ్చారు. ఛైర్మెన్ నర్సింహ్మారెడ్డి, సెక్రటరీ త్రిశూల్‌రెడ్డి ఆధ్వర్యంలో భోగి మంటలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. విద్యార్థులకు నిర్వహించిన వివిధ పోటీల్లో ప్రతిభ కబర్చిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఛైర్మన్ నర్సింహ్మారెడ్డి దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లోకనాథం, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న సెక్రటరీ, విద్యార్థులు

బాలాజీనగర్ పాఠశాలలో..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాల బాలాజీనగర్‌లో గురువారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రంగువల్లులతో పాఠశాల ప్రాంగణాన్ని అలంకరించారు.

'కంటి వెలుగు'ను విజయవంతం చేయండి

ఘట్‌కేసర్: కంటి వెలుగును విజయవంతం చేయాలని జెడ్పీ ఛైర్మన్ శరత్‌చంద్రారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యలయంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి అధ్యక్షతన కంటి వెలుగుపై నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీపీఓ రమణామూర్తి మాట్లాడుతూ.. ఈ నెల 18న కాచవానిసింగారం, అంకుషాపూర్‌లో కంటి వెలుగు ప్రారంభం అవుతుందని ఆయా గ్రామాల్లో పూర్తి కాగానే మరో రెండు గ్రామాల్లో ప్రారంభిస్తామని, పాలకవర్గాలు సహకరించాలన్నారు.

- అనంతరం జరిగిన కార్యదర్శుల సమావేశంలో ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ.. నామమాత్రం కంటి పరీక్షలు, రూ. 100 విలువ చేసే అద్దాలు ఇచ్చి ప్రజలన తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపించారు. ఒకే రోజు 300 మందికి పరీక్షలు ఎలా చేస్తారని, అవసరమైన వారికి కంటి ఆపరేషన్లు చేయకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ అరుణా రెడ్డి, ఎంపీఓ నందికిశోర్, నారపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారిని శోభన, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శరత్‌చంద్రారెడ్డి

సర్పంచ్ అక్రమాలపై డీపీఓ విచారణ



విచారిస్తున్న డీపీఓ రమణామూర్తి

ఘట్‌కేసర్: అదనపు కలెక్టర్ అగస్త్య అభిషేక్ ఆదేశానుసారం ఎదులాబాద్ సర్పంచ్ సురేశ్‌పై పాలకవర్గ సభ్యులు ఇచ్చిన అవనీతి ఆరోపణలపై జిల్లా పంచాయతీ అధికారి రమణామూర్తి గురువారం విచారణ చేపట్టారు. గ్రామంలోని రేణుకా సహస్ర ఇన్‌ఫ్రా వెంచర్‌లో చేపట్టిన కట్టడాలు, గ్రామ సభల నిర్వహణ, ఆర్థిక సంఘం, పంచాయతీ నిధులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. నకిలీ రసీదులు, సర్పంచ్, బిల్ కలెక్టర్‌పై వచ్చిన ఆరోపణలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఎంపీఓ నందకిశోర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉష, వార్డు సభ్యులు ఆంజనేయులు ముదిరాజ్, శ్రీనివాస్, సురేశ్, మాజీ ఎంపీటీసీ కుమార్ ముదిరాజ్ పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పించండి సారూ

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ కార్మికనగర్‌లో కనీస వసతులు, సౌకర్యాలు కల్పించాలని గురువారం నిరాహార దీక్ష చేపట్టారు. ప్రజానాట్యమండలి మేడ్చల్ జిల్లా కార్యదర్శి వెంకటాచారి హాజరై వారికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుర్వాసనతో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్నారని, కాలనీకి మౌలిక వసతులు కల్పించాలలన్నారు. కాలనీలో ఫాగింగ్ చేయకపోవడంతో డెంగీ బారిన పడుతున్నారన్నారు. అదే విధంగా కాలనీలో ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో చిన్నారులు చదువుకు దూరమవుతున్నారని పాఠశాల, బస్తీ దవాఖానా, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జంగిడి శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



నిరాహారదీక్ష చేస్తున్న కాలనీవాసులు

పండక్కి ఊరెళ్తే..
పోలీసులకు సమాచారం ఇవ్వండి!

- సూచనలు పాటించాలంటున్న పోలీసులు
- ఆటోల ద్వారా కాలనీ, బస్తీల్లో ప్రచారం

ఘట్‌కేసర్: సంక్రాంతి వేడుకలు సొంతూరులో సరదాగా జరుపుకునేందుకు ఆసక్తి చూపుతుంటారు. పల్లె, పట్టణమనే తేడా లేకుండా పిల్లాపాపలతో సొంతూళ్లకు పయనమవుతున్నారు. అదను చూసి చేతివాటం ప్రదర్శించాలని చోరులు ఈ సయమంలోనే ఎదురు చూస్తుంటారు. తాళం వేసిన ఇళ్లనే లక్ష్యంగా చేసుకుని పగలు రెక్కీ నిర్వహించి చీకటి పడగానే ఇళ్లను గుల్ల చేస్తుంటారు. చోరీలు జరుగకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారుల సూచనలు, సలహాలు పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

పోలీసుల సూచనలు..

- ఇంటిళ్లిపాది సంక్రాంతికి దూర ప్రాంతాలకు వెళ్లేవారు ఇంటి పక్కన ఉండే నిఘా పెట్టాలని కోరాలి.
- వాహనాలను ఇంటిలోపల నిలపాలి. పేపర్, పాలవాళ్లను రావొద్దని ముందే చెప్పాలి.
- ఇంటిలో ఎప్పుడూ ఒక లైటు వేసి ఉంచాలి. ఖరీదైన నగలు, నగదు ఇంట్లో పెట్టరాదు.



- ఇంటికి వేసిన తాళం కనిపించకుండా డోర్ కర్టెన్ వేయాలి. గేటుకు లోపలి నుంచి తాళం వేయాలి.
- డోర్‌కు సెంటర్ లాక్ సిస్టం ఏర్పాటు చేసుకోవాలి. ఇంటిలో సీసీ కెమరాలు బిగించుకొని మొబైల్ యాప్ ద్వారా సీసీ కెమరాల దృశ్యాలు వీక్షిస్తుండాలి.
- ప్రధాన ద్వారం వద్ద గ్రిల్స్ ఏర్పాటు చేసుకోవాలి. విలువైన వస్తువులున్న బ్యాగును పెద్దలు తమ దగ్గరే ఉంచుకోవాలి. నివాస ప్రాంతాల్లో కొత్త వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపిస్తే డయల్ 100కు కాల్ చేయాలి.

సూచనలు పాటించండి..



పోలీసుల సూచనలు తప్పకుండ పాటించాలి. మాకు సమాచారమిస్తే ప్రత్యేక గస్తీ ఏర్పాటు చేస్తాం. ఇంటింటకీ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. కాలనీల్లో కొత్త వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే 100 టోల్ ఫ్రీ లేదా 9490617137 నంబర్‌కు సమాచారం ఇవ్వండి.

–అశోక్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఘట్‌కేసర్

విలువైన వస్తువులు వెంట తీసుకెళ్లాలి..



పట్టణం, కాలనీ, గ్రామానికి దూరంగా ఉన్నవారు మరిన్ని జాగ్రత్తలు పాటించాలి. బీరువాలో బంగారు అభరణాలు, విలువైన ఇతర వస్తువులు పెట్టొద్దు. అనుమానం వచ్చిన వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి.

– జంగయ్య, డిటెక్టీవ్ ఇన్‌స్పెక్టర్ ఘట్‌కేసర్